ఒపీవోలుగా అంగన్‌వాడీ వర్కర్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల విధులకు ఓపీవోలుగా అంగన్‌వాడీ వర్కర్లను నియమిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ పీవో, ఏపీవో, నలుగురు ఓపీవోలు ఉంటారన్నారు. నగరి నియోజకవర్గ ఎన్నికలకు తిరుపతి జిల్లా సిబ్బందిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్నికల పరిశీలకులు కైలాష్ వాంఖ్డే, షాదిక్ అలాం సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరి నియోజకవర్గ పరిధిలోని నిండ్ర, విజయపురం, నగరి మండలాలకు చిత్తూరు జిల్లా ఎన్నికల సిబ్బందిని, పుత్తూరు, వడమాలపేటలకు తిరుపతి జిల్లా సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 1,889 మంది పీవోలు, 1,993 మంది ఏపీవోలు, 7,961 మంది ఓపీవోల ర్యాండమైజేషన్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ శివయ్య, డీఐవో సుధాకర్ రావు, అడిషనల్ డీఐవో భానుప్రకాష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో నిలిచేదెవరో..?

నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేదెవరనే దానిపై సోమవారం స్పష్టత రానుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థుల్లో ఎవరైనా స్వయంగా రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి ఉపసంహరించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి అఫిడవిట్లను ఆయా ఆర్వోల కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి 21మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 83 మంది ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉపసంహరణ పర్వం ముగిసిన అనంతరం బరిలో మిగిలే వారెవరో తెలుస్తుంది.

నేడు చిత్తూరులో బాలకృష్ణ పర్యటన

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం చిత్తూరులో పర్యటించనున్నారు. 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా ఆయన సాయంత్రం 5.30 గంటలకు వెంగారెడ్డిపల్లె, 5.40 గంటలకు బ్యాన్స్ హోటల్ సర్కిల్, 5.50 గంటలకు సంతపేట రాగిమాను సర్కిల్, 5.55 గంటలకు గాంధీరోడ్డు, 6 గంటలకు గాంధీ సర్కిల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

- తీరు మారని అధికారులు
- కొట్టిన వారిని విడిచిపెట్టి, దెబ్బలుతిన్న వారిపై కేసు
- టీడీపీ నేతలే లక్ష్యంగా సోదాలు


వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నేతల వాహనం

ఇదేమి స్వామి భక్తి.!

చిత్తూరు, ఏప్రిల్ 28: ఎన్నికల కోడ్ అమల్లోకొచ్చి 40 రోజులు దాటినా ఇంకా కొంతమంది అధికారులు వైసీపీ నేతలకు స్వామిభక్తి చాటుతూనే ఉన్నారు. అధికార పార్టీ నేతలకు సలాం కొడుతూ ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తూ మానసికంగా దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. చిత్తూరులోని ఓ మహిళా అధికారి ఆధ్వర్యంలో టీడీపీ నాయకుల నివాసాలే లక్ష్యంగా సోదాలు చేస్తుండగా.. టీడీపీ శ్రేణుల మీద వైసీపీ నేతలు జరిపిన భౌతిక దాడిలో నిందితులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న ఓ పోలీసు అధికారి తీరే ఇందుకు నిదర్శనం. ఈ ఇద్దరు అధికారులు చిత్తూరులో వైసీపీ అభ్యర్థి పక్షాన ఉంటూ అతని గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ దాడి చేస్తే టీడీపీ నేతలను తీసుకెళ్లారు..

టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అనుచరులైన సాయి కిరణ్, జగదీష్, శ్రీనివాస్‌లు శనివారం రాత్రి చిత్తూరు రూరల్ మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకున్నారు. ఇన్నోవా వాహనంలో వస్తూ ఎస్టేట్ వద్ద టీ తాగడానికి దుకాణం వద్ద వాహనం ఆపారు. అంతలోనే చిత్తూరుకు చెందిన కొందరు వైసీపీ నాయకులు వచ్చి వారిని విచక్షణా రహితంగా కొట్టారు. సెల్‌ఫోన్లు లాక్కున్నారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బలు తిన్న టీడీపీ కార్యకర్తలను, వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. దాడి చేసిన వారి నుంచి బాధితుల సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని.. వారు వైసీపీ నేతలు కావడంతో విడిచిపెట్టారు. ఇంతవరకు టీడీపీ కార్యకర్తలపై ఎవరు దాడులు చేశారనేది పోలీసులు చెప్పలేదు. పైగా టీడీపీ వాహనాన్ని స్టేషన్ వద్దే ఉంచుకున్నారు.

టీడీపీ నేతల లక్ష్యంగా సోదాలు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి మహిళా అధికారి కూడా స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారు. టీడీపీ నేతలే టార్గెట్‌గా వారి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి సెర్చ్ వారెంట్లు లేకుండా ఏకంగా టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ఇంటిపై శనివారం ఉదయం 7 గంటలకే పోలీసులు, ఎక్సైజ్, మున్సిపల్ సిబ్బందిని వెంటబెట్టుకుని తనిఖీలకు వెళ్లారు. ఎంపీ అభ్యర్థి సెర్చ్ వారెంట్ అడిగినా ఇవ్వకుండా ఇంట్లో, ఆఫీసులో సోదాలు నిర్వహించారు. దగ్గుమళ్ల గట్టిగా నిలదీయడంతో ఉదయం 11 గంటలకు సెర్చ్ వారెంట్ ఇచ్చారు. కనీసం ఎన్నికల నిబంధనలు తెలుసుకోకుండా ఎలాపడితే అలా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న ఈ అధికారుల తీరు పలు విమర్శలకు దారి తీస్తోంది.

వైసీపీ కండువా ఒక్కటే తక్కువ

ఆ ఇద్దరు అధికారులు వైసీపీ కండువా కప్పుకోవడం తప్ప మిగిలిన పనులన్నీ అధికార పార్టీకి అనుకూలంగా చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. వారి తీరుపై చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

మానసికంగా దెబ్బతీసేందుకే..

- టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు, జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28: టీడీపీ నేతలే టార్గెట్‌గా ఎన్నికల అధికారులు, పోలీసులు తనిఖీలు చేస్తూ వారిని మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో దగ్గుమళ్ల విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు ఎన్నికల తనిఖీల ప్రత్యేక బృందం పేరుతో తన ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారని, ఏమీ దొరక్కపోవడంతో వెళ్లారని తెలిపారు. శనివారం రాత్రి తమ పార్టీ కార్యకర్తలపై వైసీపీ అల్లరి మూకలు దాడిచేస్తే చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు వారిని విడిచిపెట్టి దెబ్బలు తిన్న మా కార్యకర్తలను, వారి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. గురజాల మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తి అని, ఆయన ఆలోచనలన్నీ క్రిమినల్‌గానే ఉంటాయని తెలిపారు. టీడీపీ శ్రేణులు ఇలాంటి బెదిరింపులకు భయపడవన్నారు. రాబోయే రోజుల్లో దీటుగా సమాధానం చెబుతామన్నారు.

సన్ డే

నిప్పులు చెరుగుతున్న సూర్యుడు

ఆరెంజ్ జోన్‌లోకి పులిచెర్ల, పుంగనూరు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ప్రజలు బయటకు రాలేక... ఇంట్లో ఉండలేక అల్లాడిపోతున్నారు. ఆదివారం పులిచెర్ల, పుంగనూరు మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. పులిచెర్లలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీరంగరాజపురంలో 43.1, పుంగనూరు, తవణంపల్లె 42.6, బంగారుపాళ్యం 41.9, గుడిపాల 41.6, సదుం 41.3, కుప్పం 41.3, పాలసముద్రం 41.1, చిత్తూరు 40.9, గుడుపల్లె 40.8, పెద్దపంజాణి 40.8, కార్వేటినగరం 40.7, గంగవరం 40.6, వెదురుకుప్పం 40.6, రొంపిచెర్ల 40.5, శాంతిపురం 40.5, నగరి 40.5, చౌడేపల్లి 40.5, గంగాధరనెల్లూరులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బోర్ ఆపరేటర్‌పై వేటు

చిత్తూరు, ఏప్రిల్ 28 : ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా రాజకీయ పార్టీ ప్రచారంలో పాల్గొన్న 9వ వార్డు బోర్ ఆపరేటర్ ప్రేమకుమారిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఏఆర్వో అరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రచారంలో పాల్గొన్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు రావడంతో మున్సిపల్ ఇంజనీర్, ఎంసీసీ టీమ్ క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించారు. నియోజకవర్గ ఆర్వో, జేసీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏఆర్వో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

3, 4 తేదీల్లో నియోజకవర్గాల్లో శిక్షణా తరగతులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28: ఆర్వోల ఆధ్వర్యంలో వచ్చేనెల 3, 4 తేదీల్లో నియోజకవర్గాల్లో ఎన్నికల శిక్షణా తరగతులు జరపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. ఆదివారం జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్, సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి పొరబాట్లకూ తావివ్వకుండా సెక్టోరల్ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మే 13న ఉదయం 5.30 గంటలకల్లా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లకు 12వ తేదీనే పాసులివ్వాలని సూచించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి 16 మందికి మించి అభ్యర్థులు బరిలో ఉన్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి పాల్గొన్నారు.

రూ.8.67లక్షల నగదు సీజ్

చిత్తూరు, ఏప్రిల్ 28 : నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళుతున్న రూ.8.67 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. ఒకటో పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు.. కొంగారెడ్డిపల్లెకు చెందిన సాయి కిరణ్ శనివారం రాత్రి బిల్లులు లేకుండా రూ.5 లక్షలను కారులో తీసుకెళుతున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో ఎంఎస్ఆర్ థియేటర్ వద్ద ఆపి తనిఖీ చేయగా నగదు దొరికింది. బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు.

రామకుప్పంలో రూ.3.67లక్షలు..



రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు - నాథూసింగ్ నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

రామకుప్పం: బూరుగుమాకులపల్లె వద్ద ఎంసీసీ, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టి రూ.3.67లక్షల నగదు సీజ్ చేశారు. వి.కోట నుంచి శాంతిపురానికి వెళుతున్న కారును తనిఖీ చేయగా శాంతిపురానికి చెందిన నాథూసింగ్ వద్ద బిల్లులు లేని రూ.2లక్షలు దొరికింది. శాంతిపురం నుంచి వి.కోట వైపు వస్తున్న లగేజీ వాహనాన్ని తనిఖీ చేయగా గంగవరం మండలం జీడిమాకులపల్లెకు చెందిన రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం వద్ద రూ.1.67 లక్షల నగదు దొరికింది. ఎటువంటి రసీదులూ లేకపోవడంతో సీజ్ చేశారు.

అలరించిన దుర్యోధన వధ




వెదురుకుప్పం, ఏప్రిల్ 28: వెదురుకుప్పం మండలం మొరవ గ్రామ మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో దుర్యోధన వధ ఘట్టం అలరించింది. దుర్యోధనుడి మట్టి బొమ్మ తయారు చేసి దుర్యోధనుడు, భీముడి వేషధారులు ఆ ఘట్టాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. అన్నదానం చేశారు. రాత్రి అగ్ని గుండ ప్రవేశంతో మహాభారత ఉత్సవాలు ముగిశాయి. ప్రధాన కార్యనిర్వాహకులు బోడిరెడ్డి మోహన్ రెడ్డి, బోడిరెడ్డి తారకరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ హౌస్



నీటితో కళకళలాడుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు - పంపుహౌస్

నిర్మాణం పూర్తయినా.. నీరందలేదు

నిరుపయోగంగా పుంగనూరు ఎస్ఎస్ ట్యాంకు

పైపులైన్ సమస్యతో జనం గొంతు తడవని వైనం

పుంగనూరు, ఏప్రిల్ 27: పట్టణంలో ఏళ్ల తరబడి నీటి ఎద్దడి ఉంది. ప్లాంట్ల వద్ద కొనే నీరు శుభ్రత లేని కారణంగా అవస్థలు పడుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రజలకు శుద్ధి జలాలు అందించాలనే లక్ష్యంతో 2009లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి పుంగమ్మ చెరువులో రూ.33.33 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు పనులు మంజూరు చేశారు. తొలుత ఎస్ఎస్ ట్యాంకుకు సదుం మండలం పాపిరెడ్డిగారిపల్లె గార్గేయనది నుంచి నీటిని పైపుల ద్వారా లిఫ్ట్ చేసేలా ప్రతిపాదించారు. తర్వాత వైఎస్సార్ మృతి చెందడం, పెద్దిరెడ్డి మంత్రి పదవి కోల్పోవడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత కాలంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. వనమలదిన్నె రోడ్డులో హంద్రీ నీవా కాల్వ నుంచి నీటిని అక్కడే ఫిల్టర్‌హౌస్‌లోకి అక్కడి నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేయడం, తర్వాత పైపులైన్ ద్వారా పలమనేరు రోడ్డులోని సంపు నింపి శుద్ధిచేసి పట్టణంలో సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు. 65వేల మందికి సరఫరా చేసేలా 32.28 కిలోమీటర్ల పైపులైన్లు వేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి పంపింగ్ సమస్యలు రావడంతో గాలికి వదిలేశారు.

జగన్ హామీ ఇచ్చినా ఫలితం శూన్యం..

గత ఎన్నికల సమయంలో సదుంలో జరిగిన బహిరంగ సభలో ప్రతిపక్ష నేతగా జగన్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడం, జగన్ క్యాబినెట్‌లో స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్థానం దక్కడంతో ఇక తమకు శుద్ధి జలాలు వస్తాయని, బయట కొనాల్సిన పనిలేదని పట్టణ ప్రజలు ఆశపడ్డారు. చూస్తుండగానే ఐదేళ్లు గడిచిపోయాయి తప్పా ప్రజల గొంతు తడవలేదు. వైసీపీ అధికారంలోకి రాగానే రూ.2 కోట్లతో కట్టపై తారురోడ్డు నిర్మాణం, నీటిని పంపింగ్ చేయడానికి పెద్ద పెద్ద మోటార్లు, అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ వసతి ఏర్పాటు చేశారు. శుద్ధి జలాలు ఇచ్చేందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పినా ఆచరణలో కనిపించలేదు.

నిరుపయోగంగా భవనాలు, పరికరాలు

హంద్రీనీవా జలాలు ఎస్ఎస్ ట్యాంకుకు పంపింగ్ చేయడానికి నిర్మించిన ఫిల్టర్‌హౌస్, సంపు నిరుపయోగంగా మారాయి. పంపుహౌస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి, వైరు తీసుకెళ్లారు. కరెంట్ వైర్లను తెంపేశారు. ఫిల్టర్ హౌస్ అధ్వానంగా తయారై అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పంపుహౌస్, పబ్లిక్‌హెల్త్ డీఈ కార్యాలయం, క్లారీపాక్యులేటర్ ట్యాంకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నిరుపయోగంగా ఉన్నాయి. నిర్మాణం పూర్తి అయినా ఏదో కారణాలతో ప్రజలకు మాత్రం నీరందకుండా ఎన్నికల హామీలకే పరిమితమవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు - ఛత్తీస్‌గఢ్ వాసి మృతి



మృతిచెందిన యువకుడు - చెట్టును ఢీకొన్న కారు

నగరి ఏప్రిల్ 28: పట్టణ పరిధిలోని ధర్మాపురం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఒక కారు ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఛత్తీస్‌గఢ్ వాసి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు నుంచి నగరికి వస్తున్న టాటా ఇండికా కారు తిరుపతి-చెన్నై జాతీయ రహదారి ధర్మాపురం వద్ద టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కనున్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇంటి బయట కూర్చుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గంగ (25)ను ఢీకొంది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు బైక్‌పై పడి..


మహేంద్ర (ఫైల్ ఫొటో)

పూతలపట్టు: కారు ద్విచక్ర వాహనంపై పడడంతో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని వేపనపల్లి బస్టాప్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సుదర్శన్ ప్రసాద్ చెప్పిన వివరాల మేరకు.. వేపనపల్లి పంచాయతీ బూసిపల్లె గ్రామానికి చెందిన మహేంద్ర (52) పని నిమిత్తం పోటుకనుమ గ్రామానికి చెందిన మిత్రుడు సింహాద్రి నాయుడితో కలిసి బైక్‌లో కొత్తకోటకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. వేపనపల్లి బస్టాప్ వద్ద తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొడుతూ వచ్చి బైక్‌పై పడింది. తీవ్రంగా గాయపడిన మహేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. సింహాద్రినాయుడికి తీవ్ర గాయాలు కావడంతో పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యంకోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నప్పటి నుంచే చంద్రబాబు ఆదర్శం



లౌక్యంగా వ్యవహరిస్తూ సీనియర్లందర్నీ కలుపుకొని వెళ్లడం.. నిత్యం ప్రజల్లో ఉంటూ టీడీపీని బలోపేతం చేయడం.. దళితులకు తమ వాడంటూ నమ్మకం కలిగించడం.. సమాజం పట్ల అవగాహన ఉన్న ఇతను తమ కోసం ఏదో చేస్తాడని యువతను ఆకట్టుకోడం.. ప్రతి ఇంటి గడపనూ తొక్కి ఆశీర్వదించమని కోరడం.. పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ విజయానికి సోపానాలుగా చెప్పుకోవచ్చు. అధిష్టానం ఇన్‌ఛార్జిగా నియమించిన తక్కువ సమయంలోనే ఓ వైపు పార్టీని బలోపేతం చేస్తూ.. మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పూతలపట్టు ప్రజల గళాన్ని అసెంబ్లీలో వినిపించి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటున్న మురళీమోహన్‌తో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ..

- చిత్తూరు ఆంధ్రజ్యోతి

- దళితులు ఇంట్లో పెద్ద బిడ్డలా ఆదరిస్తున్నారు
- అక్రమ కేసులు పెట్టి 53 రోజులు ప్రజలకు దూరం చేశారు
- రాచరికం చెలాయించను.. సేవకుడిలా అందుబాటులో ఉంటా..
- ఇక్కడి ప్రజల ఆదరణ చూస్తుంటే రుణం తీర్చుకోలేననిపిస్తోంది
- కచ్చితంగా నియోజకవర్గంలో మార్పు చూపిస్తా
- ఈసారి పూతలపట్టులో ఎగిరేది టీడీపీ జెండానే

జర్నలిజంలో నా ప్రస్థానం

చదువుకునే రోజుల నుంచే రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ఉంది. అప్పట్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవాడ్ని. ఆ తర్వాత జర్నలిజం నా జీవితాన్ని మలుపు తిప్పింది. జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ చేసి వివిధ పత్రికలు, ఛానల్స్‌లో పనిచేశాను. ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘానికి పదేళ్ల పాటు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సంఘానికి రాష్ట్ర జనరల్ సెక్రటరీతో పాటు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో పలు హోదాల్లో పనిచేశాను.

ఒకే తీర్మానంతో నన్ను ఎంపిక చేశారు

జర్నలిస్టు యూనియన్ లీడర్‌గా చంద్రబాబు నన్ను గుర్తు పట్టేవారు. పెద్దగా పరిచయం లేదు. కానీ నియోజకవర్గంలో కొందరు సీనియర్ లీడర్లు నన్ను గుర్తించారు. గుణవంతుడు, చదువుకున్నవాడు, స్థానికుడు, బంధుత్వాలున్నాయి, సమాజం పట్ల అవగాహన ఉన్నవాడు అని నన్ను అభ్యర్థిగా ప్రపోజ్ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు నా అభ్యర్థిత్వానికి ఏకవాక్య తీర్మానం చేశారు. అందరూ ఆమోదించిన వ్యక్తి అని చంద్రబాబు గతేడాది పూతలపట్టు బహిరంగ సభలోనూ చెప్పారు.

రాజకీయాల్లోకి వచ్చేందుకు కారణం

నాకు చిన్నప్పటి నుంచి కూడా పత్రికలు చదివే అలవాటు ఉంది. 1990ల్లో చంద్రబాబు రాజకీయాల్లో యువకెరటంలా ఎగిసి పడుతున్నారు. అందులోనూ మా సొంతూరు పూతలపట్టుకు ఆయన చంద్రగిరి దగ్గరి ప్రాంతం. ఓ సామాన్య కుటుంబంలో పుట్టి కోట్ల మందికి ఆదర్శంగా నిలిచారంట అని ఆయన చేసిన పనుల గురించి పత్రికల్లో రోజూ చదివి ఇన్‌స్పైర్ అయ్యాను. పూతలపట్టు మండలం గొడుగుచింత అనే హైస్కూల్ లో పది వరకు చదివి ఇంటర్మీడియట్‌కు చంద్రబాబు చదివిన చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లిపోయాను. నేను ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో ఆయన ప్రారంభించిన జన్మభూమి కార్యక్రమం బాగా విజయవంతమైంది. ఓ పాలకుడు ప్రజల్ని ఏవిధంగా ప్రభావితం చేయగలడనేది అర్థమైంది. నాయకులు, అధికారులు కాకుండా ప్రజల కోసం ప్రజలే పనిచేసేలా, తోటి మనిషికి సాయపడే అలవాటును ఆయన అలవర్చారు.

వీళ్ల కోసం ఏ త్యాగానికైనా సిద్ధం

సామాన్య కార్యకర్త నుంచి పెద్ద స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ నాకు అపూర్వ సహకారం అందిస్తున్నారు. టికెట్లు ఆశించినవారు కూడా నాతో కలిసి పని చేస్తున్నారు. ఇంతటి ఆదరణ పొందడానికి నేనేదో అదృష్టం చేసుకున్నాను అనిపిస్తోంది. తొలి జాబితాలో నా పేరు రానప్పుడు నాకంటే ఎక్కువగా శ్రేణులు ఫీల్ అయ్యారు. వందల మంది ఏడుస్తూ మాట్లాడారు. వీళ్ల కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడాలని అప్పటి నుంచి నాకు అనిపించింది.

11 అక్రమ కేసులు పెట్టి వేధించారు

నన్ను ఇన్‌ఛార్జిగా నియమించి ఏడాది కాకముందే ఏ కారణం లేకుండానే 11 కేసులు పెట్టారు. ఎవరో ఏదో కారణంతో మరణిస్తే దానికి ప్రేరణ నేనని 304-2 సెక్షన్ కింద కేసు పెట్టారు. 53 రోజులు నియోజకవర్గంలో ప్రజలకు, కుటుంబానికి దూరమయ్యాను. ఇక్కడి ప్రజల్ని చైతన్య పరుస్తున్నాడని, మార్పు చూపిస్తున్నాడని నామీద కుట్ర పన్ని వైసీపీ నేతలు పోలీసులతో కలిసి అక్రమ కేసులు పెట్టించారు. ఎక్కడికైనా వెళ్లి మాట్లాడితే కేసు, ధర్నా చేస్తే కేసు.. ఇలా ఒకే రోజు ఆరు కేసులు పెట్టారు. ఓ రాత్రి ఆరు స్టేషన్లను తిప్పుకుంటూ వెళ్లి జడ్జి ఎదుట ప్రవేశపెడితే.. అతన్ని ఎందుకింత హింసించారని జడ్జి కూడా ఆశ్చర్యపోయారు.

ముగ్గురు ఎమ్మెల్యేలు మూడు నిమిషాలూ మాట్లాడలేదు

ఎమ్మెల్యే అంటే అధికారం చెలాయించే రాచరికం కాదు. ఓ సేవకుడు మాత్రమే. సేవకుడు ఎలా ఉండాలని నిర్వచనం చెప్పేందుకు నేనొచ్చాను. ఈ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు పనిచేశారు. వీళ్లు అసెంబ్లీలో కనీసం మూడు నిమిషాలు కూడా నియోజకవర్గ సమస్యల గురించి చర్చించలేదు. ఒక్కో ఎమ్మెల్యే మీద ప్రభుత్వం ఐదేళ్లలో రూ.3 కోట్లను ఖర్చు పెడుతుంది. ఈ రూ.3 కోట్ల నిధుల్ని కూడా నియోజకవర్గానికి తీసుకుని రాలేకపోయారు.

దళితుల్ని వైసీపీ పురుగుల కంటే హీనంగా చూస్తోంది

వైసీపీ అనేది వాడుకుని వదిలేసే విధానాన్ని పేటెంట్ ఉన్న పార్టీ. దళితుల్ని అవమానించడం, పురుగు కంటే హీనంగా చూడడం ఆ పార్టీకే సొంతం. 2019లో సునీల్‌కుమార్‌ను, 2024లో ఎంఎస్ బాబును ఘోరంగా అవమానించింది. అందుకే దళితుల్లో ఈసారి భారీ చైతన్యం వస్తోంది. పూతలపట్టు నియోజకవర్గంలో దళిత ప్రాంతాలు గ్రామాలకు గ్రామాలు టీడీపీలోకి చేరిపోతున్నాయి. నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి పెద్ద బిడ్డగా నన్ను ఆదరిస్తున్నారు. ముద్దు బిడ్డగా నన్ను ఆశీర్వదిస్తున్నారు. కచ్చితంగా ఈ నియోజకవర్గంలో ఓ మార్పు చూపిస్తా.



ఓటు అడిగే హక్కు నాకే ఉంది

ఐదేళ్లపాటు సునీల్‌కుమార్ ఎమ్మెల్యేగా ఉండి ఏం చేశారు. కనీసం ఐదు నిమిషాలు అసెంబ్లీలో మాట్లాడలేదు. చెప్పాలంటే ఐదేళ్ల జీతం అతను వెనక్కి ఇవ్వాలి. సునీల్ కుమార్‌తోపాటు ఎంఎస్ బాబుకు కూడా ఓటు అడిగే హక్కు లేదు. బాధ్యత లేని వాడికి హక్కు ఉండదు. నేను బాధ్యతతో ఉన్నాను. ప్రజలకు అందుబాటులో ఉంటాను. నాకు ఓటు అడిగే హక్కు ఉంది. గత ముగ్గురు ఎమ్మెల్యేలు ఎస్సీ కుటుంబాలను పట్టించుకోలేదు.

ఎంఎస్ బాబు పోటీ పట్ల..

ఒకరి బలహీనతల నుంచి నేను బలం పెంచుకోవాలనుకోను. స్వతహాగా నేను బలవంతుడ్ని కావాలని కోరుకుంటా. చంద్రబాబును అనుసరించి నేర్చుకుంది ఇదే. తొలిసారి పూతలపట్టులో టీడీపీ జెండా ఎగరనుంది.

మామిడి, పాడి రైతుల కోసం ప్రత్యేక ప్రణాళిక

గెలిచిన తర్వాత 26 అంశాలను అమలు చేయాలని నిర్ణయించుకున్నాం. ఇక్కడ ఎకరం పొలమున్న దళిత కుటుంబం కూడా వంద మామిడి చెట్లను పెట్టుకుంది. వంద ఎకరాల ఆసామీ మామిడి చెట్లనే పెట్టుకున్నారు. మామిడికి గిట్టుబాటు ధరల్లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 10 రోజుల్లోనే మామిడిని మార్కెటింగ్ చేసుకోగలగాలి. లేకుంటే ఏడాది శ్రమ వృథా అయిపోతుంది. మామిడి బోర్డు ఏర్పాటు సాధ్యం కాదు. దానికి సమాన విధానాన్ని ఏర్పాటుచేస్తాం. ఇక్కడ ప్రతి ఇంట్లో ఓ ఆవు ఉంది. పాల ధర ఇష్టానుసారంగా ఉంది. ప్రభుత్వంతో మాట్లాడి ధరల స్థిరీకరణ తెస్తాను.

దళితులు చస్తే పూడ్చేందుకు స్థలం కూడా లేదు

పుట్టినవాడికి బతకడానికి ఇల్లు లేని సమాజం చూడకూడదు.. చచ్చినవాడికి పూడ్చడానికి స్థలం లేని గ్రామం చూడకూడదు. ఏ ఎస్సీ కాలనీకి వెళ్లినా శ్మశానం లేదనే బాధ నన్ను వెంటాడుతోంది. అడవిలోని జంతువులకు, ఊర్లో బతికే మనుషులకు వ్యత్యాసం లేకుండా పోయింది. దీని రూపుమాపాలనుకుంటున్నాను. పూతలపట్టు నియోజకవర్గం నుంచే సంఘ సంస్కరణ ప్రారంభిస్తాను.

పరిశ్రమల స్థాపనకు వేల ఎకరాలున్నాయి

బెంగుళూరు, చెన్నై నగరాల పక్కనున్న ప్రాంతమిది. చుట్టూ అనేక రకాల జాతీయ రహదారులున్నాయి. పెద్ద పెద్ద కంపెనీలను రిక్వెస్ట్ చేసి ఇక్కడికి పెద్దఎత్తున తెచ్చే ఆలోచన ఉంది. అమర్‌రాజా సంస్థకు చెందిన 250 ఎకరాలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వేల ఎకరాలు ఇక్కడున్నాయి. పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది. ఫలితంగా జీవనశైలిలో మార్పులు వస్తాయి. తలసరి ఆదాయం పెరుగుతుంది.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్





చిత్తూరు 12వ డివిజన్, 16, 38వ డివిజన్ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల జగన్మోహన్, గురజాల ప్రతిమ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని 12వ డివిజన్ నరిగపల్లి, కన్నికాపురం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు మౌళిక వసతులే తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టి సంక్షేమం పేరుతో ప్రజాధనాన్ని వృథాచేశారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వివిధ రకాల పన్నులు విధించి అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందుకు గురిచేసిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్ళీ సీఎం కావాలన్నారు. మంచి భవిష్యత్తు కావాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు గోపినాథ్, రవి నాయుడు, చిట్టిబాబు, సురేష్, త్యాగరాజులు, మనోజ్, సుధాకర్, శశిధర్‌రెడ్డి, శంకర్ మండి, దేవరాజ్ నాయకర్, భాను పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేదలకు ఎంతో ఉపయోగం

నగరంలోని 16, 38వ డివిజన్ల పరిధిలోని దర్గానగర్ కాలనీ, ఏఎస్ఎం వీధి, తానప్పశెట్టి వీధి, రాగిమాను వీధి, రంగారెడ్డి వీధిలలో తెలుగు మహిళలతో కలసి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిమ మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నేతలు గుడిపాల బాలాజి నాయుడు, వైవీ రాజేశ్వరి, వసంత్ కుమార్, చిట్టిబాబు నాయుడు, గిరి, రాంప్రసాద్, చిన్నబ్బ నాయుడు, జనసేన నేతలు దయారాం, పుష్ప బీజేపీ నేత చిట్టిబాబు, తెలుగు మహిళలు గౌరి, కవిత, వనజ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు అనే ఆయుధంతో టీడీపీని గెలిపించాలి

పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



టీడీపీ తీర్థం పుచ్చుకున్న మహాసముద్రం దళితులు

ఐరాల, ఏప్రిల్ 28 : ఓటర్లు తమ ఓటును వజ్రాయుధంలా వాడి టీడీపీని గెలిపించాలని పూతలపట్టు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఆయన వైఎస్ గేటు ప్రాంతంలో నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన బట్టలు ఐరన్ చేశారు. అలాగే టీ దుకాణంలో టీ వేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపు హరిబాబునాయుడు, ఎంఎన్.చౌదరి, ప్రతాప్‌నాయుడు, కొల్లారమేష్, ధనంజయనాయుడు, శ్రీధర్‌నాయుడు, నాగేశ్వరనాయుడు, లత పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: దళితుల సంక్షేమం కోరే పార్టీ టీడీపీ అని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శనివారం రాత్రి మహాసముద్రం గ్రామానికి విచ్చేసిన మురళీమోహన్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. మహాసముద్రం గ్రామానికి చెందిన 300 మంది దళితులు మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ .జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి మురళీమోహన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్రనాయుడు, కమల్‌నాథ రెడ్డి, ఎన్‌పీ విక్రమ్, మహేంద్ర గౌడ్, జనార్దన్ గౌడ్, శంకర్ రెడ్డి, నవీన్ చౌదరి, హేమచంద్ర నాయుడు, రమేష్, కొండేటి శివ, సుదర్శన్ నాయుడు, మహిళలు పాల్గొన్నారు.

ఆదివారం నల్లంగాడు కోటూరులో సుమారు 80 ఎస్సీలు, బీసీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అలాగే సీఎం కండ్రిగలో సర్పంచ్ ప్రవల్లిక, ఆమె అనుచరులు వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా పార్టీ కార్యదర్శి కోదండ యాదవ్, ఇందిర, మండల అధ్యక్షుడు జయప్రకాష్, ధరణి నాయుడు, కోకాప్రకాష్ నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు హరీష్, తులసీ నాయుడు, జ్యోతిరెడ్డి, బాలాజి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టించుకోని రోజాను ఓడించాలి



పాదిరేడులో మాట్లాడుతున్న భాను ప్రకాష్

వడమాలపేట,ఏప్రిల్28:ఇంటిల్లిపాది అక్రమాలకు పాల్పడుతూ ఐదేళ్లలో ప్రజల సమస్యలను పట్టించుకోలేని రోజాను ఓడించాలని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కోరారు. ఆదివారం ఆయన వడమాలపేట మండలంలోని కల్లూరు, టీసీ అగ్రహారం, లక్ష్మమ్మ కం డ్రిగ, తట్నేరి, పాదిరేడు కాయంపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారం లోకి రాగానే రోజా అక్రమాలపై విచారణ చేపడతామని, చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయలు నాయుడు, వెంకటయ్య, ఉమాపతిరావ్, భాస్కర్‌నాయుడు, మోహన్, అంజెయ్య, ఉదయ్ యాదవ్, మురళి, అయ్యప్ప, హేమాద్రి నాయుడు, దాముయాదవ్, పూల గణపలి, శుభచంద్ర, చందు, రవిరెడ్డి, దాము, ముదిరాజ్, హేమావతి, లక్ష్మీప్రసన్న, మణిరాజు, పెద్దబ్బరాజు, లలితమ్మ, రామూర్తి నాయుడు, మాదవనాయుడు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : ప్రజల సంక్షేమ కోసం గాలి భానుప్రకాష్‌ను గెలిపించుకోవాలని జనసేన నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరులో జరిగిన ఎన్డీఏ కూటమి ఆత్మీయ సమావేశం మహేష్ మాట్లాడుతూ రోజాను ఇంటికి పంపడానికి జనసైనికులు, టీడీపీ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. అనంతరం గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు అంతం పలకాలంటే ప్రతి ఒక్కరు కష్టపడాలని కోరారు. కార్యక్రంలో టీడీపీ నాయకులు చినబాబు, డిఎన్. ఎలుమలై, గాలి జీవరత్నం నాయుడు, రవికుమార్, ధనపాల్, షణ్ముగ రెడ్డి, మణిరెడ్డి, విక్కీరాయల్, యుగంధర్, మణిరాజు, బొబ్బలి యాదవ్, నగరి, నింద్ర, రమేష్ రాజు, బేతు సుబ్రమణ్యం, జనసేన నాయకులు సురేష్‌బాబు, నాగార్జున, కృష్ణయ్య, పేపర్ రమేష్ బాబు, వెంకటముని, పుత్తూరు, వడమాలపేట, నగరి, విజయపురం జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం తథ్యం : థామస్



ఎమ్మెల్యే అభ్యర్థి థామస్‌కి పూలమాల వేసి స్వాగతిస్తున్న నాయకులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 28: వైసీపీ నిర్లక్ష్యపాలన అంతమై టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావడం తథ్యమని గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్ స్పష్టం చేశారు. ఆదివారం వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ గెరిగిదొన నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను ఇచ్చి మే 13వ తేదిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్‌కి, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు సైకిల్ గుర్తులపై ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు.

గంగాధరనెల్లూరు : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ సోదరుడు వి.ఎం.నిధి ఆదివారం గంగాధరనెల్లూరు మండలంలోని నెల్లేపల్లె పంచాయతీలో నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు డాక్టర్ థామస్, దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, దేవసుందరం పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన భర్త డాక్టర్ థామస్‌ను ప్రజలు ఆదరించాలని ఆయన సతీమణి శాంతిరెడ్డి కోరారు.

థామస్ మ్యానిఫెస్టో ఇదే..

గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అయితే చేసే పనుల మ్యానిఫెస్టోను ఆదివారం థామస్ ప్రకటించారు.

- వెదురుకుప్పంలో మహిళా డిగ్రీ కళాశాల
- నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శ్మశానాలు. దారి ఏర్పాటు
- ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- ప్రతి మండలంలో యాభై పడకల ఆస్పత్రుల ఏర్పాటు
- ప్రతి మండలంలో వెటర్నరీ ఆసుపత్రుల ఏర్పాటు వైద్యుల నియామకం
- వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రీ ఏర్పాటు, యాభై వేల మందికి ఉపాధి కల్పించడం
- గ్రామాల్లో తాగునీరు కలుషితమై చాలా మందికి కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్ సమస్యలు ఉన్నాయి. కాబట్టి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో 255 మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

ఆదివారం విలాసవరహాపురం పంచాయతీలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిరెడ్డి సూపర్‌సిక్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్, సిద్దయ్యశెట్టి, చంద్రబాబురెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, సూరిరెడ్డి, గుణశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం మండలం కేఎం పురం ఆదిఆంధ్రవాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రాన్ని నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ భార్య శాంతి రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రన్నను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు.

సామాజిక స్పృహలేనిదే దైవత్వం సిద్ధించదు

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 28: ప్రతి వ్యక్తి జీవితంలో సామాజిక స్పృహ లేకుంటే అతని జీవితం వృథా అని, కావున ప్రతి వ్యక్తి తనలోని లోపాలు ఎప్పటికప్పుడు సవరించుకుంటూ సామాజిక స్పృహ కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం నారాయణి సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి వడ్డాది సుబ్బరాయకవి రచించిన భక్తచింతామణి శతకంపై ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతనలేని జీవితం కావాలంటే ప్రతి వ్యక్తి తనలోని ఈర్ష్య, ద్వేషాలను పారదోలాల న్నారు. నేడు జరుగుతున్న పరిస్థితులకు భక్తచింతామణి శతకంలో వడ్డాది రచించన అంశాలకు ఎంతో పొంతన ఉందన్నారు. భక్తి, రక్తి, భుక్తి, ముక్తి జీవితంలో ప్రధాన ఘట్టాలైనా చివరకు మృత్యువు మాత్రం అందరికి సమానం అని తెలిపారు. దీనిని ననుసరించి ఎప్పటి కప్పుడు బతుకు సాగించడమే జీవన పరమార్థం అని తన మూడు రోజుల ప్రవచనాల కార్యక్రమాలను ముగించారు. అనంతరం నిర్వాహకులు నారాయణి సేవాసంస్థ డైరక్టర్ సురేష్‌బాబు, పీఆర్వో కళ్యాణచక్రవర్తి, గో రక్షణ ట్రస్టు నిర్వాహకులు చిరంజీవి, మునీంద్ర, హరికరుణలు గరికపాటిని సత్కరించారు.

ఆముదాలలో అర్జున తపస్సు



పాలసముద్రం, ఏప్రిల్ 28: మండలంలోని ఆముదాలలో మహాభారత మహోత్సవం వైభవంగా జరుగుతోంది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అర్జున తపస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.అర్జున పాత్రధారి తపస్సుమానును ఒక్కో మెట్టు ఎక్కుతూ పద్యం పాడుతూ సాగిన తపస్సు ఆకట్టుకుంది. అర్జునపాత్రధారి విసిరే విబూది పండు, నిమ్మపండును దక్కించుకోవడానికి సంతానం లేని మహిళలు వరపడ్డారు.

అమ్మఒడి పద్మనాభనాయుడికి ఉగాది పురస్కారం



చిత్తూరు రూరల్ ఏప్రిల్ 28: అమ్మఒడి ట్రస్ట్ ఫౌండర్ పద్మనాభ నాయుడుకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో మార్పు సంస్థ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉత్తమసేవలకు గాను అమ్మఒడి పద్మనాభ నాయుడుకు సంస్థ అధినేత దలవాయి గురప్పనాయుడు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

నేటినుంచి వసంతోత్సవం

కార్వేటినగరం, ఏప్రిల్28: కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వసంతోత్సవాలు సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తారు. సోమవారం మధ్యాహ్నం స్వామికి తిరుమంజనం, సాయంత్రం అస్థానం, రాత్రి స్వామివారికి తిరువీధుల ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

ద్రౌపది అమ్మవారి సేవలో గురజాల



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 28: చిత్తూరు రూరల్ మండలం పెరుమాళకండ్రిగలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపది సమేత ధర్మరాజులును అలంకరించి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లారీని ఢీకొన్న కారు

● తృటిలో తప్పిన ప్రమాదం

పూతలపట్టు, ఏప్రిల్ 28: ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి కారు ఢీకొనడంతో బెంగుళూరుకు చెందిన ఓ కుటుంబం స్వల్పంగా గాయపడి, పెనుప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. బెంగుళూరులో నివాసముంటున్న రవి తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్ళి తిరిగి బెంగుళూరుకు వెళ్ళేందుకు ఆదివారం ఉదయం కారులో మండలంలోని వేము కళాశాల సమీపాన వెళ్తుండగా కారు డ్రైవర్ ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న రత్నమ్మ, సంధ్య, రవితో పాటు మరో ఇద్దరు చిన్నారు స్వల్పంగా గాయపడి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ సుదర్శనప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

గుడిపాల, ఏప్రిల్ 28: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లి గ్రామంలో రెండ్రోజులుగా నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం వసంతాలతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామి చిత్రపటాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పోటుకనుమలో ముగిసిన మహాభారత యజ్ఞం



పూతలపట్టు, ఏప్రిల్ 28: మండల పరిధిలోని పోటుకనుమలో మహాభారత యజ్ఞం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఇందులో భాగంగా భీముడు-దుర్యోధనుడి వేషధారులచే ఆదివారం నిర్వహించిన యుద్ధ సన్నివేశం పలువురిని ఆకట్టుకుంది. భీముడు తన గధతో దుర్యోధనుడి మోకాలిపై కొట్టడంతో మహాభారత కార్యక్రమం ముగిసింది. దుర్యోధనుడి మట్టి ప్రతిమకోసం పలువురు ఎగబడ్డారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

గుడిపాల, ఏప్రిల్ 28: మండలంలోని చిత్తపార పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం గుడిపాల, యాదమరి పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 197 రామాపురం దళితవాడలో 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సంపత్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 28: మండలంలోని ముక్కళత్తూరు, కాశేపల్లె, పాచిగుంట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల గదులను ఆదివారం ఎన్నికల పరిశీలకులు, అడిషినల్ డీజీ అమృతరాజ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు, భద్రతా చర్యలపై పోలీస్ అధికారుల వద్ద ఆరాతీశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, గంగాధరనెల్లూరు సీఐ శంకర్ పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం) : కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం ఎన్నికల అబ్జర్వర్ అమరేష్‌రాజ్ దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆక్రమిత స్థలంలో కట్టడం



వడమాలపేట, ఏప్రిల్ 28: మండలంలోని సీతారామపురం వద్ద ఆక్రమిత స్థలంలో శనివారం అర్థరాత్రి ఆక్రమణదారులు ఏకంగా ఇంటి గోడలు కట్టేశారు. గతంలో రోడ్డు పక్కన లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని చదును చేసి ఆక్రమణకు యత్నించారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. తాత్కాలికంగా నిలుపుదల చేసినా ఇప్పుడేమో అక్రమంగా అర్థరాత్రి ఏకంగా గోడలే కట్టేశారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు.

చిరుత పులి లేదు

చిత్తూరు(సెంట్రల్), ఏప్రిల్ 28: అటవీ శాఖ తూర్పు రేంజ్ పరిధిలో చిరుతపులి, మూడు పిల్లలు ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్త అవాస్తవమని ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. గుడిపాల మండలం ఫుడ్ అండ్ ఇన్ ఫ్యాక్టరీ వెనుక భాగంలో చిరుతపులి, పిల్లలు ఉన్నట్లు వార్తలు రావడంతో ఆదివారం ఆ ప్రాంతంలో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ వార్తలపై విచారణ జరపగా ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది కమలేష్, మహేష్, అరుణ్ మధ్యప్రదేశ్‌లోని బాల్కట్ అటవీ ప్రాంతానికి సంబంధించిన వీడియోను వైరల్ చేసినట్లు గుర్తించామన్నారు. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

తిరుమలేశుడి సేవలో న్యాయమూర్తులు





జస్టిస్ వేణుగోపాల్ - జస్టిస్ బీఎస్ పాటిల్ - జస్టిస్ పుష్ప సత్యనారాయణ

తిరుమల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వేణుగోపాల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీబ్రేక్ సమయంలో ఆలయంలోనికి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కర్ణాటక లోకాయుక్తా జస్టిస్ బీఎస్ పాటిల్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ జుడిషియల్ మెంబర్ జస్టిస్ పుష్ప సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే తమిళనాడు దేవదాయ మంత్రి శేఖర్‌బాబు, గజల్ శ్రీనివాస్, వారణాశి కమిషనర్ కుషల్‌రాజ్‌శర్మ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

జగన్ రెడ్డీ... నీ ఆటలిక సాగవు

● గుడితో పాటు లింగాన్నీ మింగే బియ్యపు రెడ్డి ● ఇసుక కింగ్ కిలివేటి సంజీవయ్య ● సూళ్లూరుపేట,రేణిగుంట సభల్లో బాలకృష్ణ





రేణిగుంట సభలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులు, నేతలతో బాలకృష్ణ

రేణిగుంట , ఏప్రిల్ 28 : 'జగన్ రెడ్డీ ఇక నీ ఆటలు సాగవు. మొదలైన ఎన్నికల యుద్ధంలో ఓటమిని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండు. నీ పొగరు అణిచే రోజు వచ్చింది. సునామీ యుద్ధం రాబోతుంది, అందరూ సిద్ధంగా ఉండండి. ఎన్డీఏ కూటమి విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు' అని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని రేణిగుంటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.'టీడీపీకి ఉన్న కార్యకర్తలు మరే పార్టీకి లేరు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఐదేళ్ల పాటు వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొన్నారు. ఇక మంచి రోజులు వస్తాయి. అభివృద్ధికి, నీతినిజాయితీలకు మారుపేరైన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్థానంలో శ్రీకాళహస్తి గుడి, గుడిలో లింగాన్ని మింగేవాళ్లను చూస్తున్నాం.భూ కబ్జాలతో పాటు ఉద్యోగాలు అమ్ముకోవడంలో బియ్యపు రెడ్డిది ప్రత్యేక బ్రాండు. జగన్ రౌడీ రాజ్యానికి నిదర్శనం శ్రీకాళహస్తిలో సుధీర్ రెడ్డిపై హత్యాయత్నం' అంటూ బాలకృష్ణ ధ్వజమెత్తారు.

ఆలస్యానికి క్షమించండి

' రేణిగుంటకు రావడం ఆలస్యమైనందుకు క్షమించాలి. ఎక్కడికెళ్లినా మీ అభిమానంతో ఎక్కువ సమయం గడిపేలా చేస్తోంది. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంటల్లో జనాన్ని చూస్తుంటే కూటమిని గెలిపించుకోవాలన్న మీ పట్టుదల, అకుంఠిత దీక్ష కనిపిస్తోంది.ఎక్కడ చూసినా.. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అన్న నినాదాలే వినిపిస్తున్నాయి'అని బాలకృష్ణ చెప్పుకొచ్చారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు ఈ సందర్భంగా బాలకృష్ణకు 500రూపాయల నోట్లతో తయారు చేయించిన కిరీటం పెట్టి నాణేల మాల వేసి సత్కరించారు.చేతికి కత్తి అందించారు.కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇటువంటి ఎమ్మెల్యే మీకు అవసరమా?

ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు వచ్చిన బాలకృష్ణ ప్రచార రథంపై వినాయకుడి గుడి నుంచి బాపూజీ వీధి గుండా ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా బాలయ్యను పలువురు గజమాలలు,శాలువాలతో సత్కరించారు.ఆయన రాకముందే అభిమానులు, పార్టీ నాయకులు భారీగా చేరుకోవడంతో సూళ్లూరుపేటంతా జనసంద్రంగా మారింది.అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన సభలో బాలకృష్ణ మాట్లాడారు. ఇక్కడి ఎమ్మెల్యే ఇసుకలో కింగ్ అంట... మైనింగ్‌లో తోపు అంట... గ్రావెల్ కనిపిస్తే మాయం చేస్తాడంట.. దందాలు చేయడంతో డిగ్రీ పట్టా పొందాడంట... ఇటువంటి ఎమ్మెల్యే మీకు అవసరమా అంటూ ప్రజలను బాలకృష్ణ ప్రశ్నించారు.ప్రజల సమస్యలు పట్టని, అభివృద్ధి చేతకాని ఎమ్మెల్యేని ఇంటికి పంపాలంటూ పిలుపునిచ్చారు. బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దోచేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నాడని దుయ్యబట్టారు.కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ఈ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీకి,బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుకు ఓటువేసి జగన్ అవినీతి పాలనకు చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు.మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే పరసారత్నం,టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి,నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర రెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. - సూళ్లూరుపేట



సూళ్లూరుపేట సభలో కూటమి పార్టీల అభ్యర్థులతో బాలకృష్ణ

ఈత...కారాదు కడుపు కోత!

● సెలవుల్లో జాగ్రత్త అవసరమంటున్న నిపుణులు

సదుం, ఏప్రిల్ 28: సూర్యుడు భగభగ మండుతున్నాడు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి అన్ని వయసుల వారు ఆసక్తి చూపుతారు. సరదాగా గడపాలన్న ఆత్రుతలో నీటి వనరుల లోతు, ప్రమాదాలు గుర్తించడం లేదు. ఈ క్రమంలో ఏటా వేసవి సెలవుల్లో చాలా మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయి, కన్నవారికి అంతులేని కడుపు కోత మిగుల్చుతున్నారు. ఈ నెలలోనే సదుం మండలంలో ముగ్గురు చిన్నారులు ఈతకు వెళ్లి విగత జీవులుగా మారిపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. చెరుకువారిపల్లె సమీపంలోని కుంటలో ఈతకు వెళ్లి అన్నదమ్ములు మరణించారు. 79ఏ చింతమాకులపల్లె కారేవాండ్లపల్లెకు చెందిన మరో బాలుడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఈతకు వెళ్లినప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా లోతు గమనించాలని, బరువును బట్టి టైరు, ట్యూబులు, బూరలు, వెదురు కర్రలు, సొరకాయ బూరలు, ఆయిల్ క్యాన్లు, తేలియాడే కర్రలు, స్విమ్మింగ్ ట్యూబులు వాడాలని సూచించారు. అందరూ నీళ్లలో కాకుండా కనీసం ముగ్గురైనా బయట ఉండి నీటిలో ఉన్న వారిని నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. ప్రవాహం ఎక్కువగా ఉండే నీటిలో ఈత నేర్చుకోవడం, కొట్టడం ప్రమాదకరమని తెలిపారు.



గార్గేయ నదిలోని చెక్ డ్యాంలో ఈత కొడుతున్న బాలురు



చెరువులు, కుంటల్లో ఈత ప్రమాదకరం

చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు ఉంటాయి. నీళ్లు ఉన్నప్పుడు వాటి లోతు తెలుసుకోవడం కష్టం. వీలైనంత వరకు అటువంటి చోటుకు వెళ్లకపోవడం మంచిది. ప్రవహించే నదులు, కాలువలు, చిన్న చిన్న కుంటలు, చెక్ డ్యాంలలో ఈతకు వెళితే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చు. సెలవులు కాబట్టి పిల్లలు ఎక్కడకు వెళుతున్నారో పెద్దవాళ్లు గమనిస్తూ ఉండాలి.

- మస్తాన్ సాహెబ్, పీలేరు అగ్నిమాపక అధికారి

చిత్తూరులో జనరల్ అబ్జర్వర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన కైలాష్ వాంఖ్డే ఆదివారం చిత్తూరుకు వచ్చారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు, పూతలపట్టు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.చిన్నయ్య స్వాగతం పలికారు. నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ గురించి ఆయనకు వివరించారు.

దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు

చౌడేపల్లె, ఏప్రిల్ 28: బోయకొండ క్రాస్ వద్ద శనివారం అర్థరాత్రి దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బోయకొండ క్రాస్ వద్ద టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి, అతని అనుచరులు మంజునాథ్, మణికంట, సునీల్‌కుమార్, ఆదిశేషు, సుబ్రహ్మణ్యం, గణ, వైసీపీకి చెందిన లడ్డుల రమణ, అతని అనుచరులు మోహన, ప్రసాద్, చరణ్, హరికృష్ణ, సుబ్బులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారని, ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, రిమాండుకు పంపామని తెలిపారు.

జీవిత వాస్తవాన్ని చూపించేదే మువ్వా కవిత్వం



గంగవరం, ఏప్రిల్ 29: మనిషి తత్వాన్ని , జీవిత వాస్తవాన్ని చూపించేదే మువ్వా కవిత్వం అని ద్రవిడ విశ్వవిద్యాలయ ఆచార్యులు తిరుపతిరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కళామందిరంలో ఖమ్మంకు చెందిన కవి మువ్వా శ్రీనివాసరావు రచించిన 'అనితరుడు' పుస్తక పరిచయ సభ సాహిత్య కార్యక్రమం జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. అనితరుడు పుస్తక రచయిత మువ్వా శ్రీనివాసరావుకు జ్ఞాపికను అందజేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ కవిత, పళ్లిపట్టు నాగరాజు, ప్రముఖ కవులు, రచయితలు పలమనేరు బాలాజీ, కుమారస్వామిరెడ్డి, ఇందుమౌళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, దోర్నాదుల సిద్ధార్థ, డాక్టర్ నగరం, వినోద్, యుగంధర్, గిరిధరమూర్తి, టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి, కట్టమంచి కృష్ణవేణి, మలిచెట్ల దేవేంద్ర, మురళి పాల్గొన్నారు.

చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి మా బాధ్యత

● టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 28 : చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతను తాము తీసుకుంటామని టీడీపీ చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. ఆదివారం నగరంలోని 35, 36, 37 డివిజన్లకు సంబంధించి ఎంజీఆర్ వీధిలో సమావేశం నిర్వహించారు. దగ్గుమళ్ల మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఇండస్ట్రియల్ హబ్, గుడిపాల మండలంలో గార్మెంట్స్, షూ కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి, ప్రభుత్వాస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పేదలకు పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను ఇస్తామన్నారు. తేనెబండ నుంచి తోటపాళ్యం వరకు నీవానదికి ఇరువైపులా వరద ముంపునకు గురికాకుండా రక్షణ గోడ నిర్మిస్తామని తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల మండల కేంద్రాలలో ఉన్న ప్రభుత్వాస్పత్రులను 100 పడకలుగా ఆధునికీకరిస్తామన్నారు. గురజాల మాట్లాడుతూ నియోజకవర్గంలో గడపగడపకూ తిరుగుతున్నపుడు ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నామని, ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య వ్యవస్థలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేసి, విద్యాప్రమాణాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఐఐఐటీ, నవోదయ, కేంద్రీయ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న అడవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు చంద్రప్రకాష్, కఠారి హేమలత, సప్తగిరి ప్రసాద్, గాంధీ, సుబ్రి, గోళ్ల హేమాద్రి నాయుడు, వెంకటేష్ యాదవ్, గుణశేఖర్, అరుణ, మురుగ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న నియోజకవర్గ ప్రజలు

ఏజెంట్లుగా ఉండరాదని అక్రమ కేసులు

● కోడ్ ఉన్నా పట్టించుకోని పోలీసులు

● పెద్దిరెడ్డిపై చల్లాబాబు ఫైర్

పుంగనూరు, ఏప్రిల్ 28: మంత్రి పెద్దిరెడ్డి ప్రయోజనం కోసం అక్రమంగా 140 మంది టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచి ఎన్నికల ఏజెంట్లుగా పనిచేయకుండా కుట్రచేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం ఆయన పుంగనూరులో మాట్లాడుతూ మరో 15 రోజుల్లో మంత్రి, వారి పార్టీ అధికారం కోల్పోవడం ఖాయమని ఆ విషయాన్ని పుంగనూరు పోలీసులు ఇంకా గుర్తించడంలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా పోలీసులు అన్యాయంగా రెచ్చగొట్టి గొడవలు చేయించి నియోజకవర్గంలోని 500 మందిపై పెద్దిరెడ్డి ఆదేశాలతో అక్రమకేసులు పెట్టి జైళ్లకు పంపి హింసించారని విమర్శించారు. పుంగనూరుకు కొద్ది రోజుల్లో స్వాతంత్ర్యం వస్తుందన్నారు. మంత్రి దోపిడీ, దౌర్జన్యాలు, అరాచకాలు అంతం చేస్తానని చెప్పారు. పోలీసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చౌడేపల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డితో పాటు కార్యకర్తలపై దాడిచేస్తే తిరిగి బాధితులపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బి.వెంకటమునియాదవ్, ప్రదీప్ ఉన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబుకు ఓటేసి కుప్పం అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఏప్రిల్ 28: కుప్పం అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నియోజకవర్గానికి, అక్కడి ప్రజలకు ఎంతో చేశారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బెంగళూరులో వివిధ ఉపాధి పనుల నిమిత్తం వెళ్లి నివశిస్తున్న నియోజకవర్గ ప్రజలందరూ తప్పనిసరిగా కుప్పం వచ్చి చంద్ర బాబుకు ఓటేసి తమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. బెంగళూరులోని సైనిక్ వెల్ఫేర్ సెంటర్‌లో శనివారం ఆయన అక్కడ నివసిస్తున్న కుప్పం ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి చర్యలు, విద్యావిధానంలో కల్పించిన అవకాశాలు, నెలకొల్పిన విద్యా సంస్థల వల్లనే ఇప్పుడు ఎంతోమంది కుప్పం ప్రజలు బెంగళూరులో ఉద్యోగాలు పొంది, ప్రశాంతమైన జీవనం గడుపుతున్నారని వివరించారు. చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్య సాధనలో అటువంటి వారంతా కుప్పం వచ్చి ఆయనకు ఓటేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పెద్దపల్లె గంగమ్మ జాతర

కుప్పం, ఏప్రిల్ 28: కుప్పం కొత్తపేటలో వెలసిన పెద్దపల్లి గంగమ్మ జాతర ఆదివారం వైభవోపేతంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేషాలంకరణలు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మూడు రాష్ట్రాలనుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి జంతు బలులిచ్చారు. పొంగళ్లు పెట్టి నైవేద్య సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి జాతరలో ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన దుకాణాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. రంగులరాట్నాలు, ఇతర ఆట పరికరాలతో కూడిన ఎగ్జిబిషన్‌లో తల్లిదండ్రులు వారి పిల్లాపాపలతో ఉల్లాసంగా గడిపారు.

ఉచిత గుండె పరీక్ష శిబిరం విజయవంతం

కుప్పం, ఏప్రిల్ 28: కుప్పంలోని బీఆర్‌డీ హాస్పిటల్‌లో కోలార్ హార్ట్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె పరీక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 50 రోగులను పరీక్షించి అందులో ముగ్గురిని ఉచిత గుండె శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ మహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి ప్రసాద్, సభ్యులు చరణ్, శివప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్, వెంకటరామ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువత



రామకుప్పం, ఏప్రిల్ 28: రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ గాంధీనగరంలోని పలువురు వైసీపీకి చెందిన యువకులు, మహిళలు, గొరివిమాకులపల్లెకు చెందిన బీసీ నేతలు ఆదివారం టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన అరుల్‌కుమార్, కావేరీ, మర్రియప్ప, అశోక్, శ్రీకాంత్, మురళి, ప్రసాద్, నవనీత, అజిత్, వర, సుబ్రహ్మణ్యం, మంజునాథ్, జయంతి, సరోజమ్మ, అయ్యప్ప, గొరివిమాకులపల్లెకు చెందిన శ్రీనివాసులుగౌడు, ధనంజయగౌడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జీ మహ్మద్‌రఫీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రైతు సంక్షేమానికి టీడీపీ కృషి

రామకుప్పం, ఏప్రిల్ 28: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి టీడీపీ అన్నివిధాలా కృషి చేస్తుందని రామకుప్పం మండలం మణీంద్రం యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, సీబీఎన్ ఆర్మీ జిల్లా కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి మణీంద్రం పంచాయతీ చింతకుప్పం గ్రామంలో చంద్రబాబు తరపున వారు ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు భానుమూర్తి, రామ చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, దివాకర్, చిరంజీవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓం శక్తి ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ విరాళం

చౌడేపల్లె: స్థానిక సంతగేటు సమీపంలో నిర్మిస్తున్న ఓం శక్తి ఆలయ నిర్మాణం కోసం మాజీ సర్పంచ్ పద్మావతమ్మ రూ.25,120 ఆదివారం విరాళంగా ఇచ్చినట్లు ఓం శక్తి భక్తురాలు భవాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతమ్మ అల్లుడు రాధ, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మైనారిటీలకు పెద్దపీట

కల్లూరు, ఏప్రిల్ 28: టీడీపీ హయాంలోనే ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేశామని పుంగనూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి చల్లా రామ చంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం చల్లా రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కల్లూరు నాలుగురోడ్ల కూడలికి చేరుకున్న ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సన్మానించారు. అనంతరం పుంగనూరు రోడ్డు, దాసరిగూడెం, ఊకాలబావివీధి, దిగువవీధి, కొత్తకాలని, తలారి వారి పల్లి, బీసీకాలనీ, బజారువీధి, ఎగువవీధి, ఈరసానిపల్లి తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కల్లూరులో నెలకొన్న సమస్యలపై టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుకు ఓట్లేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా కల్లూరు పంచాయతీలోని వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. కల్లూరులోని వైసీపీకి చెందిన నాసిర్, నవాజ్ ఆలీ, మోసా, అఫ్జల్, జాకీర్, హసీన్, నాజర్, మునేంద్ర రాయల్, మనోహర్, శిద్దయ్య, బాలచంద్ర, ఉపేంద్ర, అనిల్, ఆనంద్, మోహన్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, ముల్లంగి వెంకటరమణ, ధనంజయనాయుడు, నూర్‌బాషా, ఖాదర్‌వల్లి, అష్రఫ్, అబ్బాస్, రమేష్, ఈఎం రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమలలో పుంగనూరు బీజేపీ కన్వీనర్ గన్నా మదన్ మోహన్ బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ● జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో తంగేళ్లమిట్ట, సవరంవారిపల్లెలో ప్రచారం చేశారు. మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, మాజీ సర్పంచ్ సుధాకర్, ప్రభాకర్, కిరణ్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి పెద్దగొట్టిగల్లు పంచాయతీ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మాజీ సర్పంచ్ రమణ, తెలుగురైతు అధ్యక్షుడు ఓబులేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు: టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా పుంగనూరు సుబేదార్‌వీధి, చెంగారెడ్డివీధి, నానబాలవీధి, రాతిమసీదు తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. పుంగనూరులో ముస్లిం నాయకులు, కార్యకర్తలపై మంత్రి పెద్దిరెడ్డి అక్రమకేసులు, రౌడీషీట్లు పెట్టించి జైళ్లకు పంపారని ఆరోపించారు. మైనారిటీలందరూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, మైనార్టీ నాయకులు సద్దాంహూసేన్, అబ్బాస్, రాజు, పోలీస్ గిరి, నాగరాజు, రాఘవ, శ్రీనివాస్, వరదరాజులు, ఫయాజ్, అలీ, అనీస్, మణి, హరి తదితరులు పాల్గొన్నారు.


కల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి


చల్లా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువకులు


పుంగనూరు సుబేదార్‌వీధిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి వైతాళికుడు చంద్రబాబు


ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 28: చంద్రబాబు అభివృద్ధి వైతాళికుడని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డులో ఆదివారం ఆయన ఇతర పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతం గుర్తు చేసుకుందాం, బాబు రుణం తీర్చుకుందాం అనే కార్యక్రమంలో బాగంగా ఈ ప్రచారం జరిగింది. ఒకప్పుడు ఎవరూ పట్టించుకోని మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గానికి అభివృద్ధి వెలుగులు తెచ్చి, రాష్ట్రంలోనే కాక, దేశ స్థాయిలోనే గుర్తింపునిచ్చింది చంద్ర బాబేనని ఆయన ప్రజలకు గుర్తుచేశారు. చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యేంద్రశేఖర్, మంజునాథ్, సోము తదితరులు పాల్గొన్నారు.

● కుప్పం రూరల్‌లో: కుప్పం మండలం దాసేగానూరు పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా ఉంటూ ప్రమాదంలో గాయపడి ఇంటికే పరిమితమైన కార్యకర్త శరవణను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఏవీ.రవి, వెంకటాచలం గౌడ్, యూనిట్ ఇన్‌ఛార్జి రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ సాంబశివం, స్థానిక పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, అశోక్, గణేశ్, గోపి, నాగరాజు, విజయ్, మూర్తి, మంజు, విశ్వ, తిమ్మరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ విజయం..మాదిగల గెలుపు

రొంపిచెర్ల, ఏప్రిల్ 28: ఎన్‌డీఏ గెలుపు మాదిగల గెలుపని పుంగనూరు నియోజక వర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో చల్లా రామ చంద్రారెడ్డిని కలిశారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి సోమల మురళి, పుంగనూరు పట్టణ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించు కుంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో సోమల నాయ కులు నరసింహులు, రవి, ప్రకాష్, మొగిలీశ్వర్, చౌడేపల్లి, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల నాయకులు హరి, ప్రభాకర్, రవి, సి.హరి, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు : శ్రీరామ్ చినబాబు


మాట్లాడుతున్న శ్రీరామ్ చిన్నబాబు

చౌడేపల్లె, ఏప్రిల్28: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు పేర్కొన్నారు. టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డితోపాటు, కార్యకర్తల అరెస్టు విషయం తెలుసుకుని ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. వారిని పరామర్శించారు. వైసీపీ నాయకులు దాడిలో ధ్వంసమైన కారును పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిన్న వాల్మీకిపురం వద్ద టీడీపీ ప్రచార రథానికి నిప్పు పెట్టడం, గువ్వల రమేష్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై దాడులు చేయడం, పుంగనూరులో రాయంచంద్రయాదవ్‌కు చెందిన కారును పగల గొట్టడం ఘటనలు పరిశీలిస్తే పెద్దిరెడ్డి కుటుంబం ఓడిపోతోందని తెలుస్తోందన్నారు. టీడీపీ ప్రజాస్వామ్యానికి విలువ ఇస్తుందని దాడులకు భయపడదని స్పష్టం చేశారు. నాయకులు లక్ష్మీపతిరాజు, పురుషోత్తమరాజు, బాబు, ప్రదీప్ రాజు, బోజనాల రెడ్డి, బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలను మోసం చేసిన వైసీపీ

రామకుప్పం, ఏప్రిల్ 28: సీఎం జగన్ అధికారంలోకి రాగానే అట్టడుగు వర్గాలను మోసం చేశారని టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణచారి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి,మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణలు తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె, కెంచనబల్ల పంచాయతీల్లో వారు ప్రచారం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్, సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 28 పథకాలను ఆపివేశారన్నారు. తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు హరీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి తొత్తులుగా పోలీసులు: చల్లా



చౌడేపల్లె, ఏప్రిల్28: వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడులు చేస్తే తిరిగి బాధితుల పైనే కేసులు పెట్టడం ఏమిటని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. శనివారం అర్ధరాత్రి టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డితో పాటు కార్య కర్తలపై కొందరు వైసీపీ నాయకులు దాడిచేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఆదివారం చౌడేపల్లె పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. రమేష్‌రెడ్డితో కార్యకర్తలతో చర్చించారు. అండగా ఉంటామని అధైర్యపడవద్దని భరోసానిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతోనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో పుంగనూరు నియోజకవర్గంలో తనతో సహా 170 మందిపై అక్రమ కేసులు పెట్టి, రౌడీషీట్లు తెరిపించారన్నారు. అయినా టీడీపీ భయపడదని స్పష్టంచేశారు. కొంతమంది డీఎస్పీలు, సీఐలు పెద్దిరెడ్డికి తొత్తులుగా మారి తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఈవిషయంపై ఎన్నికల కమిషన్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గువ్వల రమేష్‌రెడ్డి భార్య జ్యోతితో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌యాదవ్, నాయకులు లక్ష్మీపతిరాజు, పురుషోత్తమరాజు, ఆర్‌వీటి బాబు, ప్రదీప్ రాజు, బాబునాయుడు, లాయర్ వెంకటముని, పవన్, ప్రభాకర్, కల్యాణ్ పాల్గొన్నారు.



కర్ణాటక మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్‌ఐ నరసింహులు కథనం మేరకు.. ఆదివారం మార్లపల్లె చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పుంగనూరు ఎన్‌ఎస్‌పేట గంగమ్మగుడివీధికి చెందిన అబ్రార్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా గుర్తించారు. అతడి నుంచి రూ.8,190 విలువైన మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండుకు తరలించారు.

బాధితులపైనే కేసులా..!? : గువ్వల రమేష్‌రెడ్డి


గాయపడ్డ టీడీపీ కార్యకర్త

చౌడేపల్లె, ఏప్రిల్28: వైసీపీ నాయకులు తమపై దాడి చేస్తే తిరిగి తమపై కేసులు పెట్టడం ఏంటని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ నియోజక వర్గంలో టీడీపీ ప్రభంజనం మొదలైందన్నారు. వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే తమపై దాడులకు తెగబడ్డారని విమర్శిం చారు. కార్యకర్తలు అధైర్య పడకుండా మరింత దూకుడుగా పనిచేసి వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. చల్లా బాబును గెలిపించాలని కోరారు. పుంగ నూరులో ప్రజాస్వామ్యాన్ని బతికించాలని విజ్ఞప్తిచేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28: పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె గ్రామం అరంట్ల పల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చెన్నరాయప్ప అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు సీవీ రెడ్డి, కోలాట వెంకటరమణ, రామయ్యలు ఆయన మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళుల ర్పించిన వారిలో పులి వెంకటరమణ, నరసింహులు, రాఘవ, రవికుమార్ పాల్గొన్నారు.

చెన్నకేశవుడికి పూజలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 28: మండలంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజారి హరిస్వామి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం: టీడీపీ



పెద్దపంజాణిలో టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ● చీలంపల్లెలో టీడీపీ నాయకుల ప్రచారం

గంగవరం, ఏప్రిల్ 29 : గంగవరం మండలంలో ఆదివారం వైసీపీ నుంచి 77 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కీలపల్లెలో ఆదివారం అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో సైకిలెక్కారు. పార్టీలో చేరిన వారిలో మునస్వామి రెడ్డి, కిషోర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, కోదండరెడ్డి, మాబాష, నాగరాజురెడ్డి, చెంగ్రాయ రెడ్డి, మంజునాథ పరమేశ్వర్‌రెడ్డి, గోపాల్, శీనప్ప, కృష్ణప్ప, మునస్వామి, శంకర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీలోని వైసీపీ నాయకులు మాధవరెడ్డి, సుబ్రమణ్యం, దేవరాజు, తదితరులు, తుర్లపల్లె పంచాయతీకి చెందిన అమృతకుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, భాస్కరరెడ్డి, మధురెడ్డి, తదితరులు రాజుపల్లె పంచాయతీలో రాజశేఖరరెడ్డి, చంద్రశేఖర్, నందగోపాల్‌రెడ్డి, మంజునాథ్, తదితరులు అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మాజీ ఎంపీ విజయభాస్కరరెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఆనంద, చలపతి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వి.కోట: ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు గోనుమాకులపల్లె, చిన్నవ్యామ, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని పెద్దచెల్లారగుంట పంచాయతీ కామిదొడ్డిలో జరిగిన గంగజాతరలో మాజీమంత్రి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు. ● చీలంపల్లె, నాగిరెడ్డిపల్లె, కడపనత్తం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే బీసీవై లక్ష్యం


సవరంవారిపల్లెలో హారతి పడుతున్న మహిళలు

సోమల, ఏప్రిల్ 28: రైతు సంక్షేమమే బీసీవై పార్టీ లక్ష్యమని ఆపార్టీ అధ్యక్షుడు, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోడే రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన సోమల మండలంలోని సోమల, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, నంజంపేట, పొదలకుంటపల్లె, సవరంవారిపల్లె, తుగడంవారిపల్లె, సీ.వడ్డిపల్లె, కరకమంద, నడింపల్లె, సూరయ్యగారిపల్లె, నెల్లిమంద, కందూరు, బురుజుపల్లెలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి మంత్రి సంపాదనే ధ్యేయంగా కాంట్రాక్టు పనులకే పరిమితమయ్యారని విమర్శించారు. వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాను గెలిస్తే పుంగనూరు నియోజక వర్గంలో ప్రతి రైతు కుటుంబానికి ఉచితంగా ఆవును ఇస్తానన్నారు. అన్ని మండలాల్లో పాల డెయిరీలు ఏర్పాటు చేస్తానన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పులిచెర్ల నుంచి బెంగళూరుకు రైల్వే లైన్ వేయిస్తానని పేర్కొన్నారు. నియోజక వర్గం కేంద్రంలో ట్రిపుల్ ఐటీ, షుగర్ ఫ్యాక్టరీ, 500 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీవై నాయకులు సాంబమూర్తి, సురేంద్ర యాదవ్, హరినాథరెడ్డి, ఆనంద్, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహ యాదవ్, హరియాదవ్, రామూర్తి యాదవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ వెలవెల.. అక్కడ కళకళ

ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెట్రోల్ బంకుల పరిస్థితిదీ


వి.కోటలో మూతపడిన హెచ్‌పీ పెట్రోల్ బంకు


దాసార్లపల్లె వద్ద వాహనాలు రాక..

ఈ రేట్లు చూస్తే చాలు పెట్రోల్, డీజిల్‌పై మన రాష్ట్రంలో జగనన్న వ్యాట్ బాదుడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి. దీని ప్రభావం ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లోని పెట్రోల్ బంకులపై పడింది. మిగతా చోట్ల ఎంత ధరయినా వాహనదారులు పెట్రోల్, డీజిల్‌ను వాడుకోక తప్పదు. కానీ.. వి.కోటలో మాత్రం పరిస్థితి భిన్నం. వి.కోటకు కూతవేటు దూరంలో కర్ణాటక సరిహద్దు.. దాని వెంబడే పెట్రోల్ బంకులు ఉన్నాయి. దీంతో వాహనదారులు కిలోమీటరు దూరమైనా సరే అక్కడకు వెళ్లి ట్యాంకులు ఫుల్ చేసుకుని వస్తున్నారు. మరోవైపు కర్ణాటక- మన జిల్లా మధ్య రాకపోకలు సాగించే వాహనదారులూ ఆ రాష్ట్ర సరిహద్దులోనే ట్యాంకులు ఫుల్ చేయించేస్తున్నారు. దీంతో కర్ణాటక సరిహద్దులోని పెట్రోల్ బంకుల్లో ట్యాంకులు ఖాళీ అయిపోతుంటే.. మన దగ్గర వారాలైనా ట్యాంకర్ ఖాళీ కావడంలేదు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఇక, రెండేళ్ల కిందట కుప్పం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకుకు నిర్వహణ వ్యయం కూడా రావడంలేదని మూసేశారు. మిగిలి మూడు బంకుల్లో నామమాత్రంగా వ్యాపారం జరుగుతోంది. అదే సరిహద్దుకు ఆనుకుని.. కర్ణాటకలో ఐదేళ్ల కిందట ఒకే పెట్రోల్ బంకు ఉండేది. అక్కడ దేశంలోనే అత్యధిక లీటర్ల అమ్మకం జరుగుతోందని రివార్డులు పొందారు. గత రెండేళ్లలో మరో నాలుగు పెట్రోల్ బంకులు నెలకొల్పారు. తాజాగా మరొకటి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రెండు రాష్ట్రాల మధ్య ధరల్లో రెండు, మూడు రూపాయలుంటే పర్వాలేదు కానీ.. రూ.13కిపైగా ఉంటే ఎలాగని వినియోగదారులు అంటున్నారు.

\- వి.కోట

జగనన్న బాదుడు ఎఫెక్ట్



ఏపీ(రూ.ల్లో)		కర్ణాటక	తేడా
పెట్రోల్:	111.33	100.02	11.30
డీజిల్	98.99	86.10	13.80


కర్ణాటకలో వాహనాలతో కిక్కిరిసిన పెట్రోల్ బంకు


పొంతనపల్లె వద్ద ప్రారంభానికి సిద్ధమైన మరో పెట్రోల్ బంకు

నేను దిగుబడి బాగిస్తా




పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ ఆదివారం ఐరాల మండలం సంతగేటు వద్ద ప్రచారం చేశారు. వైసీపీ సానుభూతిపరుడైన పద్మనాభరెడ్డి వద్దకెళ్లి ప్రచారంలో భాగంగా కాసేపు ముచ్చటించారు. మామిడి పంటకు ఎన్నిసార్లు మందు కొట్టావని అడగ్గా.. ఐదుసార్లు కొట్టినా దిగుబడి లేదని ఆ రైతు వాపోయారు. 'ఈసారి మురళీ అనే మందును కొట్టి చూడు. బాగా దిగుబడి వస్తుంది' అని ఆ రైతుతో అన్నారు. ఇలా విభిన్నంగా ఓట్లను అడుగుతూ.. ఓటర్లను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్నారాయన.

\- ఐరాల

పింఛన్లకు జగన్ కోత

పింఛను పేరిట గొప్పలు చెప్పే జగన్ ప్రభుత్వం వంచనకు పాల్పడింది. రకరకాల నిబంధనల పేరిట కోతలు విధిస్తూ నిలువునా మోసం చేసింది. ఐదేళ్ల పాలనలో జిల్లాలో దాదాపు 15 వేల నుంచి 25 వేల వరకూ పింఛన్ల సంఖ్యను కుదించింది. 3 లక్షల మందికి పైగా పింఛనుదారులుండగా కోతల అనంతరం 2,74,146 మంది మాత్రమే ఉన్నారు.

\- చిత్తూరు (సెంట్రల్)



జగన్ పెంచింది:
నాలుగు విడతల్లో రూ.వెయ్యి
మళ్లీ అధికారంలోకి వస్తే పెంచేది: 2028, 2029లో రూ.250 వంతున రూ.500

చంద్రబాబు పెంచింది:
రూ.200 నుంచి రూ.2000కు
మళ్లీ అధికారంలోకి వస్తే పెన్షన్:
రూ.4000 (ఏప్రిల్ నుంచే అమల్లోకి)

తనిఖీల పేరుతో పింఛన్లు కోత..

తొలి మూడేళ్లలో జగన్ ప్రభుత్వం పారదర్శకత పేరుతో సామాజిక తనిఖీలు చేపట్టి కొంతమేర లబ్ధిదారులను తొలగించింది. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని ప్రస్తుతానికి ఈ తనిఖీలను ఆపింది. అర్హులు, అనర్హుల జాబితాను కూడా సచివాలయాల్లో ప్రదర్శించలేదు.

- బియ్యం కార్డు ఆధారంగా కుటుంబంలో ఒకరికే పింఛన్ పరిమితం చేసింది.
- దివ్యాంగులు, డప్పు కళాకారులు, హిజ్రాలకు జగన్ పైసా కూడా పెంచలేదు. ఒంటరి మహిళల వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచి అనేక మందిని పింఛన్లకు దూరం చేసింది.

షరతులు వర్తిస్తాయి

పింఛనుదారుల సంఖ్య తగ్గించేందుకు జగన్ ప్రభుత్వం సవాలక్ష షరతులు విధించింది. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఉన్నా, 300 యూనిట్ల విద్యుత్ వాడినా, పట్టణాల్లో 750 చదరపు అడుగుల స్థలం ఉన్నా, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా.. నాలుగు చక్రాల వాహనం ఉన్నా, వ్యవసాయ భూమి ఉన్నా పింఛను చెల్లించేది లేదంటూ తేల్చేసింది. హెచ్‌ఐవీ రోగులకు సైతం సామాజిక భద్రత పింఛను దూరం చేసింది.

నెల దాటితే పింఛన్ రాదు..?

ఏ నెల పింఛన్ ఆ నెలలోనే తీసుకోకపోతే మరుసటి నెల ఇవ్వకూడదనే నిబంధన పెట్టింది. ఇతర ప్రాంతాలకు వెళ్లిన కూలీలు, అత్యవసర పనులు, శుభ కార్యాలకు వెళ్ళేవారు, ఆరోగ్య సమస్యలున్నవారు ఈ నిబంధనల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

జులైలో 7 వేల పింఛన్లు కట్

2022 జులైలో జగన్ సర్కార్ పింఛన్ కోతలకు శ్రీకారం చుట్టింది. ఏకంగా ఏడు వేల పింఛన్లకు కోత పెట్టింది. జనవరి నుంచి జూన్ వరకు కొత్త పెన్షన్ల కోసం 18 వేల దరఖాస్తులు రాగా, 14,307 మందికి మంజూరు చేసింది. 3693 మందికి కోత పెట్టింది. అప్పటికి జిల్లాలో 2,50,594 మంది పింఛనుదారులుండేవారు. కొత్తవి కలుపుకొని 2,64,901 పింఛన్లు ఇవ్వాలి. కొత్తగా పింఛన్లలోనూ 3347 మందిని తొలగించి చివరకు 2,61,554 పింఛన్లు మాత్రమే ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 3693 మందికి, మంజూరు చేసిన వాటిలో 3347 పింఛన్లు మొత్తంగా 7,040 పింఛన్లకు కోత పెట్టింది.



తెలుగుదేశం హయాంలో ఇలా..

కుటుంబంలో ఇద్దరు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలున్నా గత తెలుగుదేశం ప్రభుత్వం పింఛన్ ఇచ్చేంది.

- దివ్యాంగుల పింఛన్‌ను వైకల్య శాతం ఆధారంగా రూ.500 నుంచి రూ.3 వేలు పెంచింది. డప్పు కళాకారులు, హిజ్రాలకు నెలకు రూ.3వేల చొప్పున అందజేసింది.
- పట్టణాల్లో 35 ఏళ్ళు, గ్రామాల్లో 30 ఏళ్ళు దాటిన ఒంటరి మహిళలకు పింఛన్లు మంజూరు చేసింది.
- చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులకు పింఛను వస్తుండేది.
- ఏ కారణంగానైనా ఒకటి, రెండు నెలల పాటు పింఛన్ తీసుకోకున్నా తర్వాతి నెలలో బకాయితో కలిపి చెల్లించేది.
- 2014లో రూ.200 ఉన్న పింఛన్ మొత్తాన్ని 2019 నాటికి రూ.2 వేలకు పెంచింది. ఐదేళ్లలో 10 రెట్లు పెరిగింది.

● మీకు తెలుసా?

చూపుడు వేలు లేకుంటే..?



పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎడమచేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటెయ్యడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికీ తెలిసిందే. మరి.. ఎవరికైనా చూపుడు వేలు లేకుంటే పరిస్థితి ఏమిటనేది చాలామందికి తెలియదు. అలాంటి వారికి మధ్య వేలికి సిరాగుర్తు వేయవచ్చు. ఆ వేలూ లేకుంటే ఉంగరం వేలు, లేదా చిటికెన వేలు.. చివరకు నాలుగు వేళ్లూ లేకుంటే బొటన వేలుకు సిరా గుర్తు పెడతారు. ఒకవేళ ఎడమ చెయ్యే లేకుంటే.. ఆ ఓటర్లకు కుడిచేతికి ఇదే క్రమంలో సిరాగుర్తు వేస్తారు. రెండు చేతులకూ వేళ్లు లేకపోతే ఎలా? అనే ప్రశ్న రావచ్చు. అలాంటి వారికి వేళ్ల మొదలు లేదా మధ్య భాగం లేదా చేతిపై గుర్తువేస్తారు. భుజాలవరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరా గుర్తు పెడతారు.

\- చిత్తూరు కలెక్టరేట్

నోట్ దిస్ పాయింట్

మీ ఓటు తెలుసుకోండి

మీకు ఓటు ఉందో లేదో తెలుసుకోవాలంటే.. గూగుల్‌లో ceo ap erolls.ap.gov.in/ name search చేయండి. ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పేరుతో ఉన్న పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో మీ జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. హౌస్ నెంబర్ ఆప్షన్‌లో మీ ఇంటి డోర్ నెంబరు నమోదు చేయాలి. క్యాప్చా ఎంటర్ చేసి సెర్చ్ కొడితే చాలు. ఆ ఇంటి నెంబరులో మొత్తం ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారి పేర్లు, వయస్సు, ఓటరు కార్డు నెంబరు, వారి పోలింగ్ కేంద్రం నెంబరు, వారి ఓటరు వరుస నెంబరు వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. మీ ఓటు కూడా కనిపిస్తుంది. మీ కుటుంబ సభ్యుల పేర్లు కాకుండా అపరిచితుల పేర్లుంటే అవి దొంగఓట్లని లెక్క. ఒకవేళ ఆ డోర్‌నెంబరులో గతంలో మీ ఓటు ఉండి, ఇప్పుడు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లే.



\- చిత్తూరు కలెక్టరేట్


తమిళ నేస్తం

చిత్తూరు చరిత్ర

తెలుగు, తమిళ భాషలు మిళితమై.. భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపు చిత్తూరు నియోజకవర్గ ప్రజల జీవన శైలి. పాడి, కోళ్ల పరిశ్రమలతో పాటు మామిడిపై ఎక్కువమంది ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. తమిళ ప్రభావం అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో గతంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల తరఫున అభ్యర్థులు పోటీ చేయడం విశేషం. నాడు సినీ నటుడు ఎంజీ రామచంద్రన్ చిత్తూరులో ప్రచారం చేయడం ఇక్కడి తమిళ ప్రభావాన్ని చాటుతుంది. కాగా 1989, 1994, 1999 ఎన్నికల్లో సీకేబాబు వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. జిల్లా కేంద్రమైనా ఇక్కడి నుంచి ఇప్పటివరకూ ఎవరినీ మంత్రి పదవి వరించలేదు.

ఎమ్మెల్యేలు

- 1952- పి. చిన్నమ్మరెడ్డి- కాంగ్రెస్
- 1953- సింగారం- కృషికర్‌లోక్ పార్టీ
- 1955- పి. చిన్నమ్మరెడ్డి- కాంగ్రెస్
- 1962- సీడీ నాయుడు (స్వతంత్రపార్టీ)
- 1967- డి. ఆంజినేయుడు నాయుడు- కాంగ్రెస్
- 1972- డి. ఆంజినేయుడు నాయుడు- కాంగ్రెస్
- 1978- ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరి- జనతా పార్టీ
- 1983- ఎన్‌పీ ఝాన్సీలక్ష్మి- టీడీపీ
- 1985- ఆర్. గోపినాథ్- కాంగ్రెస్
- 1989- సీకే బాబు (ఇండిపెండెంట్)
- 1994- సీకేబాబు- కాంగ్రెస్
- 1999- సీకేబాబు- కాంగ్రెస్
- 2004- ఏఎస్ మనోహర్- టీడీపీ
- 2009- సీకేబాబు- కాంగ్రెస్
- 2014- డీఏ సత్యప్రభ- టీడీపీ
- 2019- ఆరణి శ్రీనివాసులు- వైసీపీ



\- చిత్తూరు


నియోజకవర్గ పరిధి: చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు

నియోజకవర్గ ఆవిర్భావం: 1952

ఎన్నికలు జరిగివి: 16 సార్లు

- ఓటర్ల సంఖ్య: 201741, ● పురుషులు: 97765
- మహిళలు: 103023, ● ఇతరులు: 34 మంది
- సర్వీసు ఓటర్లు: 868, ● ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు:51

ఇన్‌సైడ్



వైసీపీలో నైరాశ్యం!

బుజ్జగింపులు.. 'పంపిణీలు' ఫలించక అసహనం

ఐదేళ్ల పాలనలో మీకు ఏమీ చేయలేకపోయాం. నిజమే. ఇప్పుడు ఎన్నికల వేళ మీరు అసంతృప్తితో కూచుంటే పార్టీ కుదేలవుతుంది. మీకు ఏదో ఒక సాయం అందేలా చూస్తా. జనంలోకి వెళ్ల పనిచేయండి. మీలో మీరు విభేదాలతో కొట్టుకుని రచ్చకు ఎక్కొద్దు.

\- కుప్పం, శాంతిపురంలలో ఇటీవల జరిగిన గ్రామ స్థాయి ప్రజాప్రతినిధుల సమావేశంలో కొందరిని విడిగా పిలిపించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన బుజ్జగింపుల సారాంశమిది.

మీలో మీరు ఇంకా కొట్లాడుకుంటూనే ఉంటారా? పార్టీకోసం పనిచేయరా? ఎందుకు నా కడుపు కాలస్తారు? పని చేస్తే చెయ్యండి. లేకపోతే ఇంట్లో పడుకోండి. నాకుమాత్రం ద్రోహం చేయకండి.

\- శాంతిపురంలో శనివారం సాయంత్రం ఆ మండల అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీల సమావేశంలో అభ్యర్థి భరత్ చేసిన వ్యాఖ్యలివి.

సొంత పార్టీ నేతలకు పది రోజుల కిందట మంత్రి పెద్దిరెడ్డి బుజ్జగింపులు.. ఒక రోజు కిందట అభ్యర్థి భరత్ అసహనం.. వీటిమధ్య ఏం జరిగింది? వైసీపీ ఎందుకంత నైరాశ్యంలోకి వెళ్లిపోతోంది? దీని వెనుక పరిణామాలను పరిశీలిస్తే..

\- కుప్పం

కుప్పంలో వైసీపీ పైకి ఎన్ని మాటలు చెబుతున్నా పార్టీ పరిస్థితి తీసికట్టుగా మారుతోందన్నది నిజం. ఈనెల 24న భరత్ నామినేషన్ సందర్భంగా ర్యాలీ అనుకున్నంతగా సక్సెస్ కాకపోవడంపై ఆ పార్టీలో అంతర్మథనం జరుగుతోంది. నిజానికి ఫిబ్రవరి 26న సీఎం జగన్ కుప్పం పర్యటనకు ముందే వైసీపీలో లుకలుకలు బయటకు వచ్చాయి. తమకు గుర్తింపు లేకపోవడం, ఒక్క అభివృద్ధి పనీ జరగకపోవడం, ఎన్ని ఆందోళనలు చేసినా నీటి ట్యాంకర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో అధికార పార్టీ నేతలు తీవ్ర అసహనంతో ఉన్నారు. సీఎం సభను బహిష్కరించాలని అప్పట్లో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో వారిని మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్ వారిని బుజ్జగించారు. నీటి బిల్లులు విడుదలయ్యాయి. ఇక, ఆర్థిక సాయం కూడా భారీగా చేశాకనే వారంతా చల్లబడినట్లు అప్పట్లో ప్రచారమైంది. సీఎం సభకు వీరంతా హాజరైనా.. అనుకున్నంతగా జన సమీకరణ జరగలేదు. దీనికి గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడమే కారణమని తేల్చారు. తర్వాత దశలో వారిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఐదేళ్లలో మాకేం ఒరిగింది?

అధికారంలోకి వచ్చాక తమకు ఏమి ఒరిగిందంటూ నెల క్రితం ఎమ్మెల్సీ భరత్ నిర్వహించిన సమావేశంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఈ క్రమంలో పది రోజుల కిందట మంత్రి పెద్దిరెడ్డి నిర్వహించిన సమావేశాల్లోనూ తమ అసంతృప్తిని వ్యక్తపరచడంలో వీళ్లు ఏమాత్రం తగ్గలేదు. మరీ తీవ్ర అసంతృప్తిలో ఉన్న గ్రామస్థాయి ప్రజాప్రతినిధులను పిలిపించి పెద్దిరెడ్డి బుజ్జగించాల్సి వచ్చింది. ఆ తర్వాత వీళ్లనూ సంతృప్తిపరిచారు. అయినా, ప్రచారాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటోంది. శనివారం జరిగిన సమావేశంలో వారిపై భరత్ మండిపడటానికి కారణం ఇదేనని తెలిసింది. చేయాల్సిన 'సాయం' చేసినా దూరంగా ఉండిపోవడం ఏమిటని నిలదీసినట్లు సమాచారం. ఈ పరిణామాలతో భరత్ పూర్తిగా నైరాశ్యంలోకి జారిపోయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఏం చేశారని వెళ్లాలి?

'ఈ ఐదేళ్లలో గ్రామాలలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు. జనమేమో ఇంటి ముందు రోడ్డు ఏమైందని, కాలువ ఎందుకు కట్టలేదని నిలదీస్తున్నారు. పంచాయతీల స్థాయిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నేతల భూ కబ్జాలు, అమాయకులపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ఇలాంటప్పుడు ఓట్ల కోసం జనం ముందుకు ఏ నాయకులైనా ఏ ముఖం పెట్టుకుని వెళతారు' అని వైసీపీ కార్యకర్తలే అంటున్నారు.